సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 20 । జూన్ । 2025





## మేమేం చేయలేం..

జీడిపిక్కల ధరలపై పలాస ఎమ్మెల్యే చేతులెత్తేశారు. తాము ఏమీ చేయలేమని తేల్చి చెప్పేశారు.

- IIలో



## ఇల్లూ లేదు.. బిల్లూ లేదు

కూటమి ప్రభుత్వం కొత్త ఇళ్లు కలగా మారిపోయాయి. పాత ఇళ్లకు బిల్లులు రావడం లేదు.

- IIలో

## 23న జాబ్‌మేళా

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 23న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ గురువారం తెలిపారు. జేకేసీ, కెరీర్ రిక్రూట్‌మెంట్ సొల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో హెచ్‌ఎఫ్‌సీఎల్, టీసీఎల్, కియా, హుండాయ్, నెక్స్‌జెన్, యాక్సిస్, మిమీ, ప్రీమియర్ ఇంజనీర్, ఫ్లిప్‌కార్ట్, దివీస్ ల్యాబ్, మెడీకేర్, అపోలో ఫార్మసీ, ఎంబీఎస్, రెడ్డీస్ ల్యాబ్, ఏవరేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర కంపెనీలు హాజరవుతున్నట్లు వెల్లడించారు. 10వ తరగతి నుంచి ఇంజనీరింగ్ వరకు విద్యను పూర్తి చేసిన అభ్యర్థులు హాజరు కావచ్చునని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## న్యూస్‌రీల్

### 'పరిహారం ఇప్పించండి మహాప్రభో'



మాట్లాడుతున్న గిన్ని ఈశ్వరరావు, మహాలక్ష్మి

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు నిర్మాణంతో సర్వస్వం కోల్పోయినా ఇంతవరకు తమకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదని, పరిహారం ఇప్పించాలని విష్ణుచక్రం గ్రామానికి చెందిన దంపతులు గిన్ని ఈశ్వరరావు, మహాలక్ష్మి కోరుతున్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. పీడీఎఫ్ లిస్టులో తమ పేరు ఉన్నా ఇంతవరకు పరిహారం ఇవ్వలేదన్నారు. పోర్టు పునరావాస కేంద్రంలో ఐదు సెంట్లు భూమి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ ఊరు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారని, తాము మాత్రమే ఊరిలో ఉండి ఏం చేయగలమని అన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయపరంగా నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

### కల్తీ పదార్థాలు విక్రయిస్తే చర్యలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి వర్తక, వ్యాపార కేంద్రంలోని కిరాణా షాపుల్లో కాలం చెల్లిన, కల్తీ పదార్థాలు విక్రయించే షాపుల ఆట కట్టిస్తామని శ్రీకాకుళం ఫుడ్ సేఫ్టీ అధికారి జి.శ్రీరాములు హెచ్చరించారు. ఆయన గురువారం పూండి కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర సూపర్ మార్కెట్, సంతోషి కిరాణా, మరి కొన్ని షాపుల్లో తనిఖీలు చేపట్టి కల్తీ జరిగినట్లు అనుమానించి నెయ్యి, కందిపప్పు, మినప గుళ్ల శాంపిల్స్ సేకరించారు. పూండి పరిసర ప్రాంతాల వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో తనిఖీలు చేశారు. అయితే వ్యాపారులు ఫుడ్ సేఫ్టీ అధికారులపై తిరగబడి, కొంత మంది టీడీపీ నేతలను పిలిచి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా బెదింపులకు సైతం దిగడం స్థానికంగా సంచలనం కలిగించింది. ఈ విషయమై ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీరాములు మాట్లాడుతూ పూండిలోని కిరాణా షాపుల్లో కల్తీ జరిగినట్లు అనుమానించి శాంపిల్స్ సేకరించామని, వాటిని హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీకి పంపించామని తెలిపారు. ఈ విషయం జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టి సైతం తీసుకెళుతున్నట్లు ఆయన తెలిపారు.

### అకడమిక్ సిలబస్‌లపై దృష్టి



రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌ను కలిసిన భాషోపాధ్యాయులు

శ్రీకాకుళం రూరల్: అకడమిక్ సిలబస్‌లపై ఎంఈఓలు దృష్టి సారించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మునసబుపేటలో గల గురుజాడ కళాక్షేత్రంలో గురువారం 38 మండలాల ఎంఈఓలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకూ ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా పూర్తి చేసినందుకు ఎంఈఓలను అభినందించారు. రానున్న మూడు నెలల్లో అకడమిక్‌లపై దృష్టి పెట్టాలన్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న భాషోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ పిసిని వసంతరావు రాష్ట్రవిద్యాశాఖ కమిషనర్‌ను కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయుల పోస్టులను పునరుద్ధరించాలని, మాన్యువల్ బదిలీల కౌన్సెలింగ్ చేయాలని కోరారు.




ఇసుక దోపిడీ కోసం ఎంతగా బరితెగించారో తెలిపే చిత్రమిది. గార వద్ద వంశధార నదిలో ప్రవహిస్తున్న నీటికి అడ్డంగా ఇసుకాసురులు నిర్మించిన గట్టు ఇది. తవ్వకాలు జరిపే చోటుకి నీరు వచ్చేస్తుందని కరకట్ట నిర్మించి, నదీ ప్రవాహ గమనాన్ని మార్చేశారు. తీర ప్రాంతానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నా, పర్యావరణం దెబ్బతిన్నా పట్టించుకోకుండా నదిలో అడ్డంగా పొడవైన గట్టు వేసేశారంటే ఎంతగా చెలరేగిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు.

## అడ్డుకట్టలతో నీటి మళ్లింపు

# వరదొస్తే పల్లెలకు ముప్పు

- ఇసుక అక్రమ తవ్వకాలతో ముప్పులో తీర ప్రాంత గ్రామాలు
- అక్రమ సొమ్ము కోసం గార తీరంలో అడ్డదారులు
- వరదల వేళ వంశధార నదిలో అడ్డంగా కరకట్ల నిర్మాణం
- తవ్వకాలు జరిపే చోటుకి నీరు రాకుండా గట్లు వేసిన అక్రమార్కులు
- వర్షాకాలం నేపథ్యంలో భయాందోళనలో తీర ప్రాంత గ్రామ ప్రజలు





ఈ చిత్రం చూడండి. ఇసుకను లారీల్లో రవాణా చేసేందుకు నదిలో ప్రవహిస్తున్న నీరు అడ్డొస్తుందని పెద్ద పెద్ద పైపులను కింద పెట్టి, పైన గ్రావెల్‌తో గట్టు నిర్మించారు. ఆ గట్టు కింద నున్న పైపుల ద్వారా నీరు మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. వాస్తవంగా నదిలో యంత్రాలతో ఎలాంటి పనులు చేపట్టకూడదు. కానీ పట్టించుకోకుండా ఇష్టారీతిన ఇసుక నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వానలు పడుతున్నా.. నదుల్లోకి నీరు వస్తున్నా జిల్లాలో ఇసుక తవ్వకాలు ఆపడం లేదు. తరలింపు ఆగడం లేదు. ప్రభుత్వం అండదండలతో ఇసుక మాఫియా రెచ్చిపోతూనే ఉంది. ఇసుక డబ్బుల కోసం గ్రామాలను ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టేస్తోంది. నేతల జేబులు నింపడానికి ప్రజల ప్రాణాలను పణంగా పెట్టేస్తోంది. ఎవరేమైనా ఫర్వాలేదు తమ ఖజానా నిండితే చాలు అన్నట్టుగా పచ్చనేతలు చెలరేగిపోతున్నారు.

ఎగువ ప్రాంతాలతో పాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వంశధార నదిలోకి వరద నీరు వస్తోంది. దీంతో నీటి ప్రవాహం మొదలైంది. ఈ పరిణామం ఇసుక అక్రమార్కులకు రుచించడం లేదు. వరదలొచ్చి తమకొచ్చే ఆదాయాన్ని గండికొడుతోందని, ఊరకనే వచ్చే సొమ్మును కోల్పోతున్నామని తెగ బాధపడిపోతున్నారు. నదిలోకి నీరొస్తే తవ్వకాలకు ఇబ్బందని, లారీలతో తరలించేందుకు కష్టమవుతుందని మదనపడిపోతున్నారు. ఏం జరిగినా ఇసుక తవ్వకాలు ఆగకూడదు, రవాణా ఆపకూడదన్న నిర్ణయానికొచ్చి బరితెగింపునకు దిగారు. తవ్వకాలు జరిగే చోటుకి వరద నీరు రాకుండా ఉండటానికి నదీ ప్రవాహానికి మధ్యలో యుద్ధ ప్రాతిపదికన గట్టు నిర్మించారు. అంతేకాకుండా భారీ ట్రక్కుల ద్వారా ఇసుక రవాణా చేసేందుకు ఇబ్బంది వస్తుందని నదిలోనే నీటి ప్రవాహానికి అడ్డంగా పైపులతో మరో గట్టు నిర్మించారు. ఇవన్నీ యంత్రాలతోనే చేసేశారు. వాస్తవంగా నదిలో యంత్రాల ద్వారా ఎలాంటి పనులు చేపట్టకూడదు. పర్యావరణానికి హాని కలిగించే ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని సుప్రీంకోర్టు కూడా స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చింది. కానీ, ఇక్కడి నిర్వాహకులు తమకు సుప్రీంకోర్టు ఆదేశాలు ఒక లెక్కా తాము చేసిందే న్యాయం అన్నట్టుగా నదిలో అడ్డంగా నిర్మాణాలు చేపట్టారు.

**వరద ఉధృతి పెరిగితే ఆ గ్రామాలకు ముప్పే..**

నదిలో అడ్డంగా పొడవైన గట్లు నిర్మించడం వలన భారీ వర్షాల కారణంగా వరదలొస్తే దిగువ ప్రాంతాలకు ముప్పు వాటిల్లుతుంది. వరద ఉధృతికి ఆ గట్లు తెగిపడితే తీర ప్రాంత గ్రామాలు ముంపు బారిన పడక తప్పదు. ఇప్పటికే ఇసుక తవ్వకాలతో నదీ గమనం మారిపోయింది. పైపెచ్చు నదిలో అడ్డంగా పొడవైన గట్లు నిర్మించడం వల్ల ప్రవాహ గమనం మారిపోతుంది. అదే జరిగితే పెను ప్రమాదం చోటు చేసుకున్నా ఆశ్చర్య పోనక్కర్లేదు. గార వద్ద జరుగుతున్న ఇసుకాసురుల దుశ్చర్యల వల్ల లోతట్టు ప్రాంతాలైన వమరవల్లి, తోనంగి, కళింగపట్నం, మత్స్యలేశం, బందరవానిపేట, కొర్ని పంచాయతీలకు ముప్పు ఉండే అవకాశం ఉంది.

# ఊరికి ఊపిరి

ఊరు ఊపిరి పీల్చుకోవడానికి ఓ మొక్క కావాలి. మనిషి గుండె నిండా ధైర్యంగా గాలి పీల్చుకోవాలంటే ఓ మొక్కే ఎదగాలి. కాంక్రీటు వనాలు పెరిగి అసలు వనాలు తరిగిపోతున్న ఈ రోజుల్లో హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంఘం మళ్లీ ఊరికి ఊపిరి పోస్తోంది. వేలాదిగా మొక్కలను నాటుతూ ప్రాణ వాయువును పంచుతోంది. యువతను ఈ దిశగా చైతన్యవంతులను చేస్తూ ముందుకెళ్తోంది.



- సత్ఫలితాలు ఇస్తున్న హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంఘం ప్రయత్నాలు
- యువతకు పచ్చదనంపై చైతన్య పరిచే కార్యక్రమాలు
- వేలాదిగా మొక్కలను నాటుతున్న సంస్థ
- ఉత్తరాంధ్రలో సేవా కార్యక్రమాలు

రణస్థలంలో మొక్కలు నాటుతున్న హరిత సంఘం సభ్యులు



రణస్థలం: కొందరు స్నేహితులు కలిశారు.. వారికి మరికొందరు సన్నిహితులు చేయూతనిచ్చారు.. వీరికి గ్రామ పెద్దలు, యువత సహకారం అందించారు.. ఇంకేముంది ఊరిలో పచ్చటి మొక్కలు కళకళలాడుతున్నాయి. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్‌లో పని చేస్తూ ఖాళీ సమయాన్ని వృధా చేయకుండా కొంత మందిసన్నిహితులు,స్నేహితులు కలిసి హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంఘంను ఏర్పాటు చేసుకున్నారు. మానవాళి కోల్పోతున్న పచ్చదనాన్ని మళ్లీ పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తున్న రంగోలి హరిబాబు పర్యావరణ పరిరక్షణలో ప్రత్యేకతను చాటుకున్నారు.

**రెండేళ్లలో వేలాది మొక్కల ప్రాణప్రతిష్ట**

వాతావరణ మార్పులను తట్టుకోవాలంటే మొక్కలు పెంచడం ఒక్కటే దారి. అందుకే రెండేళ్లుగా ఈ సంస్థ ప్రతినిధులు సత్సంకల్పంతో వేలాదిగా మొక్కలు నాటారు. ప్రతి వేడుకలో ప్లాస్టిక్ కానుక బదులు బహుమతిగా మొక్కలు ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో పాటు రిటర్న్ గిఫ్ట్‌గా అందించే ప్లాస్టిక్ కానుకలకు బదులు సుమారు 8,500 మొక్కలు అందించారు.



గుడ్డ సంచులను ఉచితంగా అందజేస్తున్న హరిత సంఘం సభ్యులు

**ప్లాస్టిక్, పాలిథిన్ వద్దంటూ..**

ఒక్కసారి వాడి పారేసే పాలిథిన్, ప్లాస్టిక్ వల్ల భవిష్యత్ తరాలకు జరగబోయే నష్టంపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ సొంత నిధులతో క్లాత్ సంచులను తయారు చేయించి స్థానిక మార్కెట్లలో, వ్యాపార సముదాయాలలో వాటిని పౌరులకు పంపిణీ చేస్తున్నారు. వేసవి కాలంలో చెట్ల నుంచి విత్తనాలు సేకరించి తదుపరి వర్షాకాలానికి అవసరమయ్యే మొక్కలతో నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది వేప, నేరేడు, పనస, తరాయి, గంగరావి, ఏనుగు పాదం, బాదం, దేవకాంచన వంటి సుమారు 5600 విత్తనాలు సేకరించారు.

**యువత భాగస్వామ్యంతోనే..**



హరిత సొసైటీ, బుడుమూరు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చాలా సామాజిక కార్యక్రమాలు చేపట్టాం. యువత భాగస్వామ్యంతో మొక్కలు నాటడం, యోగా శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తున్నాం.

- జి.కనకరాజు, యూత్ అసోసియేషన్ సెక్రటరీ, బుడుమూరు

**మొక్కవోని దీక్షతో కార్యక్రమాలు**



పర్యావరణ పరిరక్షణకు మొక్కవోని దీక్షతో కృషి చేస్తున్నాను. స్థాపించిన రెండేళ్లలో ఉత్తరాంధ్రలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్‌లో పని చేస్తూనే ఖాళీ సమయాల్లో పర్యావరణ పరిరక్షణలో నా వంతు కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నాను. నన్ను చూసి ఒక్కరైనా మారుతారనే ఆశ ఉంది.

- ఆర్. హరిబాబు, సంఘం వ్యవస్థాపకుడు

## గిరిశిఖర గ్రామానికి వెళ్లి.. కష్టాలు తెలుసుకుని..



చందనగిరి.. ఉత్తరాంధ్రలోనే ఎత్తైన గిరిశిఖర గ్రామం. ఒకప్పుడు దారీ తెన్నూ లేని ఈ ఊరికి వైఎస్సార్‌సీపీ హయాంలో సకల సదుపాయాలు కల్పించారు. రోడ్డు వేయడంతో పాటు తాగునీటి సదుపాయాలు కల్పించారు. ఈ గ్రామాన్ని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం సందర్శించారు. వైఎస్ జగన్ హయాంలో చేసిన పనులు గుర్తు చేశారు.

IIలో

రేషన్ తీసుకువస్తున్న వృద్ధురాలితో మాట్లాడుతున్న రెడ్డి శాంతి

## సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా

పాతపట్నం: ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని చెక్‌పోస్టుల వద్ద నిషేధిత పదార్థాలైన గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణా జరగకుండా నిరంతరం నిఘా పెట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి సిబ్బందికి సూచించారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద ఒడిశా నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. పాతపట్నం, వసుంధర చెక్‌పోస్టుల్లో వాహనాల నంబర్లు పుస్తకం సక్రమంగా నమోదు చేయాలని, సిబ్బంది పనితీరు మెరుగుపడాలన్నారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సారా అమ్మకాల కట్టడికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం-2, అక్రమ మద్యం 14405 టోల్ ఫ్రీ నంబర్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాతపట్నం పరిధిలోని బి కేటగిరిలో ఉన్న బొన్ని, కోణంగి, పూతికగూడ, చాపరాయిగూడ గ్రామాల్లో నాటు సారా తయారీ, అమ్మకాలు పూర్తిస్థాయిలో నిరోధించామని, నాటు సారా రహిత గ్రామాలుగా తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కోట క్రిష్ణారావు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## మా బడి మాకు కావాలి



స్కూలు బయట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- హొన్నాళిలో రోడ్డెక్కిన విద్యార్థులు, తల్లిదండ్రులు
- స్కూళ్ల విలీనంపై ఆగ్రహం

మందస: తమ బడి తమకు కావాలని మందస మండలం హొన్నాళి గ్రామ ప్రజలు రోడ్డెక్కారు. హొన్నాళి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల నుంచి 6, 7, 8 తరగతులను సిరిపురం ఉన్నత పాఠశాలలో విలీనం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం పాఠశాల ఎదురుగా ఆందోళన నిర్వహించారు. ఎలాంటి బస్సు సౌకర్యం లేని పరిస్థితుల్లో పిల్లలను ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బడికి ఎలా పంపించాలని ప్రశ్నించారు. సిరిపురం వెళ్లే దారిలో రిజర్వ్ ఫారెస్టు ఉందని, సాయంత్రం, చీకటి పడే సమయాల్లో అడవి జంతువులు తిరుగుతాయని అలాంటి దారిలో పిల్లలు ఎలా రాకపోకలు సాగించగలరని అన్నారు. ఇదే దారిలో మహేంద్ర తనయ నది ఉందని, దానిపై రక్షణ లేని వంతెన ఉందని, దాన్ని దాటడం పిల్లలకు ప్రమాదకరమని వివరించారు. హొన్నాళి గ్రామంలో ఎంపీయూపీ విద్యార్థులు దాదాపు 100 మంది ఉన్నారు. అందులో యూపీ విద్యార్థులు 42 మంది ఉన్నారు. వీరితో పాటు నారాయణపురం స్కూల్‌ను కూడా హరిపురం హైస్కూల్‌లో విలీనం చేశారు. ఈ రెండు స్కూళ్ల మధ్య దూరం ఐదు కిలోమీటర్లు. దారిలో జీడితోటలు ఉన్నాయి. ఎలుగు బంట్ల సంచారం ఉంటుంది. దీనిపై నారాయణపురం వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎలా పంపించగలం..?**



6, 7, 8 తరగతుల వారు సిరిపురం వరకు వెళ్లాలంటే ఐదు కిలోమీటర్లు ప్రయాణించాలి. ఎలాంటి బస్సు సదుపాయం లేదు. విద్యార్థులు సైకిళ్లపైనే వెళ్లాలి. ఆ దారిలో వంతెనపై నుంచి వానాకాలంలో నీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను ఎలా స్కూల్‌కు పంపించగలం.

- నోయానో శెట్టి, హొన్నాళి

**విలీనం సరికాదు**



గ్రామంలో ఉన్న బడిని వేరే పాఠశాలలో విలీనం చేయడం సరికాదు. పిల్లలను బయటకు పంపాలంటే మాకు భయంగా ఉంటుంది. మా బడి మాకు కావాలి.

- జ్యోతి మాలిక్, విద్యార్థి తల్లి హొన్నాళి

# యోగాంధ్రకు 220 ఆర్టీసీ బస్సులు



- ప్రభుత్వ ఆదేశాలతో ఆర్టీసీ యాజమాన్యం కేటాయింపు
- జిల్లాలో 80 రూట్‌లలో 164 బస్సులతోనే సేవలు
- నేడు,రేపు ప్రజలకు తప్పని ప్రయాణ కష్టాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో 80 వరకు రూట్లలో 384 ఆర్టీసీ బస్సులు ప్రతి రోజూ తిరుగుతాయి. అయినప్పటికీ చాలా రూట్లలో బస్సులు దొరకని పరిస్థితి ఉంది. ప్రైవేటు బస్సులు, ఆటోలు, ఇతరత్రా వాహనాలను పట్టుకుని ప్రయాణాలు సాగిస్తుంటారు. ఉన్న 384 బస్సులే అరకొర అనుకుంటే, వాటిలో 220 బస్సులు విశాఖలో జరిగే యోగాంధ్ర కోసం తరలిస్తే జిల్లాలో ప్రయాణికుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడదే జరుగుతోంది.

**ఎలాగైనా జనాన్ని తీసుకెళ్లాల్సిందే..**

విశాఖలో యోగాంధ్ర పుణ్యమా అని ప్రయాణికులకు కష్టాలు తప్పవు. శుక్రవారం, శనివారం రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిందే. అత్యధిక బస్సులు యోగాంధ్ర కోసం విశాఖ వెళ్లిపోతుండటంతో ఇక్కడ ప్రయాణికులు అవస్థలు పడకతప్పదు. యోగా డే కొత్తేమి కాదు. ఏటా జూన్ 21న చేస్తుంటారు. ఎక్కడికక్కడ యోగా డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ చంద్రబాబు తన మార్క్ పబ్లిసిటీ కోసం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దగ్గర మార్కులు కొట్టేసేందుకు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. తమకున్న బలమేంటో తెలిపేందుకు, లక్షల్లో జనాలను చూపించేందుకు చంద్రబాబు అండ్‌కో తెగ ఆరాట పడుతున్నారు. అందులో భాగంగా టార్గెట్లు ఇచ్చి జన సమీకరణ చేయిస్తున్నారు. ఎవరికెన్ని ఇబ్బందులు ఉన్నా నయానోభయానో విశాఖపట్నంకు జనాలను తీసుకురావాల్సిందేనని అధికారులకు హుకుం జారీ చేశారు. ఇంకేముంది ఉద్యోగులకు సంకటంగా మారింది. భయపెట్టో, బతిమాలో.. జనాలు తరలించేందుకు ఆపసోపాలు పడుతున్నారు.



**220 ఆర్టీసీ బస్సుల తరలింపు**

జిల్లా నుంచి జనాలను తరలించేందుకు అధిక సంఖ్యలో బస్సులు కేటాయించారు. మనకున్నవి 384 బస్సులైతే, వాటిలో 220 బస్సులు యోగాంధ్ర కోసం సమకూర్చారు. ఈ లెక్కన జిల్లాలో మిగతా 164 బస్సులు మాత్రమే ప్రయాణికులకు సేవలందిస్తాయి. దీన్నిబటి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రెండు రోజుల పాటు ప్రయాణికుల రాకపోకలకు ఎంత ఇబ్బంది ఉంటుందనేది, ఇప్పుడున్న 80 రూట్లలో ఎన్ని బస్సులు తిరుగుతాయో చెప్పలేని పరిస్థితి ఉంది. ప్రత్యామ్నాయం చూసుకోకపోతే ఇబ్బందులు తప్పవు. ఇప్పటికే 60 బస్సులు ఇతర జిల్లాలకు వెళ్లిపోయాయి. ఆ బస్సులు నడవాల్సిన రూట్‌లో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం, శనివారం మిగతా బస్సులు వెళ్లిపోనున్నాయి. దీంతో ప్రయాణికుల కష్టాలు రెట్టింపవుతాయి.

**ప్రైవేటు సర్వీసులు డౌటే**

ఆర్టీసీ బస్సులే కాదు ప్రైవేటు బస్సులు కూడా జిల్లాలో ఉండే అవకాశం తక్కువే. దాదాపు 20వేల మందిని జిల్లా నుంచి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయడంతో ప్రైవేటు బస్సులు కూడా యోగా డే సేవలో తరించనున్నాయి. అదే జరిగితే ప్రైవేటు బస్సులు నడిచే రూట్లలో కూడా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. ఇప్పటివరకైతే వాటి విషయంలో క్లారిటీ లేదు. ఏ క్షణంలోనైనా సర్వీసులు రద్దు అయ్యే అవకాశం ఉంది. ప్రయాణికులు ముందస్తు సమాచారంతో రాకపోకలు సాగించడం మేలు.

## క్లుప్తంగా

### గురుకులాల్లో మిగులు సీట్లలో ప్రవేశాలకు ఆహ్వానం


గ్రేస్, జిల్లా గురుకుల సమన్వయకర్త

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గురుకుల సమన్వయకర్త గ్రేస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 19 నుంచి జిల్లాలోని 8 పాఠశాలల్లోనూ దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా బాలురుకు దుప్పలవలస, బాలికలకు ఎచ్చెర్ల గురుకులంలో ఈ నెల 25న ఉదయం 10 నుంచి పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరో తరగతిలో 279 సీట్లు, ఏడో తరగతిలో 155 సీట్లు, ఎనిమిదో తరగతిలో 92 సీట్లు, 9వ తరగతిలో 96 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పూర్తి వివరాలకు 9701736862 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

### కలప అక్రమ రవాణా అడ్డగింత


స్వాధీనం చేసుకున్న దుంగులు వద్ద విజిలెన్స్ అధికారులు

ఎచ్చెర్ల : మండలంలోని కేశవరావుపేట, కింతలిమిల్లు జంక్షన్ వద్ద విజిలెన్స్, అటవీశాఖ అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమతులు లేకుండా లారీ, బొలెరో వాహనాల్లో తరలిస్తున్న కలపను గుర్తించారు. రూ.39,405 విలువైన తొమ్మిది క్యూబిక్ మీటర్లు కలిగిన అకేషియా కలప దుంగలను పట్టుకున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు సతీష్‌కుమార్, రవిప్రసాద్, సీఐలు రామారావు, అశోక్, ఎస్ఐలు పీసీలు ఈశ్వరరావు, కన్నబాబు, లక్ష్మీనారాయణ, శేషగిరి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

### బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేష్‌కుమార్


కృష్ణయ్య నుంచి ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరిస్తున్న సురేష్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కూటికుప్పల సురేష్‌కుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నాగళ్ల మురళీధర్, జిల్లా కార్యదర్శిగా కవిటి దేవరాజ్, జిల్లా ప్రచార కార్యదర్శిగా కిల్లి కుమారస్వామిని నియమించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

### పాత జిల్లా ఆస్పత్రిలో సామగ్రి చోరీ


చోరీకి గురైన కిటికీ ఫ్రేములు

టెక్కలి రూరల్ : టెక్కలి పాత జిల్లా ఆస్పత్రిలో విలువైన ఇనుప సామగ్రి చోరీకి గురవుతోంది. ఇప్పటికే సిల్వర్ పైపులు, ఫైబర్ ఫ్రేమ్‌లు మాయం కాగా, తాజాగా కిటికీ గోడలు సైతం ధ్వంసం చేసి వాటికి ఉన్న ఐరన్ ఫ్రేమ్‌లు పట్టుకుపోయారు. విలువైన సామగ్రి చోరీకి గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

### రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై నోరు మెదపరేం?


మాట్లాడుతున్న షర్మిలారెడ్డి

శ్రీకాకుళం అర్బన్: కేంద్రం, రాష్ట్రంలోనూ బీజేపీకి ధీటైన పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి అన్నారు. గురువారం శ్రీకాకుళం పర్యటనకు వచ్చిన ఆమె ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ 11 ఏళ్లుగా రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని, ఇచ్చిన హామీలు అమలు చేయకపోయినా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నోరు మెదపడం లేదన్నారు. అన్ని పథకాల్లోనూ కోతలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టును 45మీటర్లు నుంచి 41 మీటర్లకు తగ్గిస్తున్నా, విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగాలు తొలగిస్తున్నా కూటమి ఎమ్మెల్యేలు స్పందించకపోవడం అన్యాయమన్నారు.

## జీడి పిక్కల ధరలా.. మేమేం చేయలేం!

- సమావేశంలో చేతులెత్తేసిన పలాస ఎమ్మెల్యే శిరీష
- నిరాశతో బయటకు వచ్చేసిన జీడి రైతాంగ కమిటీ ప్రతినిధులు
- అధికార పార్టీ తీరుపై మండిపాటు

పలాస: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాల్లో ఉద్దానం ప్రజల జీవనాధారమైన జీడి రైతులు కూటమి సర్కారు తీరుతో ఉసూరుమన్నారు. జీడిపిక్కల కొనుగోలు, ధరల విషయమై జీడి రైతాంగ పోరాట కమిటీ నాయకులు గురువారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్దానం జీడి రైతుల సమస్యలు, గిట్టుబాటు ధరల విషయంపై జీడి రైతాంగ కమిటీ కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, రైతు నాయకులు అంబటి రామకృష్ణ, కోనేరు రమేష్, మద్దు రాఘవరావు, అర్లి దానేసు తదితరులు ఎమ్మెల్యేకు వివరించారు. గత ఎన్నికల సమయంలో బస్తా జీడి పిక్కలను రూ.16వేలుకు కొనుగోలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సరికి బస్తా పిక్కలు ధర రూ.13,500 ఉందని చెప్పారు. అదే ధరకు రైతులంతా తప్పని పరిస్థితిలో జీడి పిక్కలను పలాస వ్యాపారులకు అమ్ముకున్నారని తెలిపారు. ఈ ఏడాది మే నెలలో కూడా రూ.13,500 మాత్రమే ఉందని, పెరుగుతుందని ఆశించినా రైతులకు నిరాశ తప్పలేదన్నారు. జూన్‌లో పెరగడం పోయి ధరలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ ప్రతినిధులు ఎంత వేడుకున్నా.. ఈ ధరలు తమ చేతుల్లో లేవని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఒక్క మాట చెప్పి చేతులెత్తేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో రైతాంగ ప్రతినిధులు నిరాశతో తిరిగి వచ్చేశారు.


ఎమ్మెల్యే శిరీషతో మాట్లాడుతున్న జీడి రైతాంగ కమిటీ ప్రతినిధులు

### ఎమ్మెల్యే తీరుపై విమర్శలు..

జీడి వ్యాపారులు జీడి పిక్కలను కొనుగోలు చేయాల్సిన సమయంలో పరిశ్రమలను ఎందుకు బంద్ చేశారని అటు జీడి కార్మికులతో పాటు జీడి రైతులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, మార్కెట్‌లో జీడి పప్పు ధర ఏమాత్రం తగ్గడం లేదు. పలాస కాష్యూలేబర్ యూనియన్, పలాస కాష్యూ అసోసియేషన్ రెండు సంఘాలు కూడా తెలుగుదేశం పార్టీ నాయకుల చేతుల్లో ఉన్నాయి. గత 20 రోజులుగా జీడి కార్మికులకు ఉపాధిలేదు. ఉద్దానం ప్రాంతంలో జీడి పిక్కలు కొనడానికి జీడి వ్యాపారులు ముందుకు రావడం లేదు. వారు కొనుగోలు చేయలేకపోవడానికి వారి వద్ద తగిన డబ్బులు లేవని ఆ వ్యాపారస్తులు చెబుతుండటం విడ్డూరంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ఇటు జీడి కార్మికులకు , అటు జీడి రైతులకు తగిన న్యాయం చేయాల్సిన ఎమ్మెల్యే శిరీష తన చేతుల్లో ఏమీ లేదని చెప్పడంపై రైతులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటూ చట్టసభలు, వివిధ రూపాల్లో పోరాటాలు చేయాల్సింది పోయి ఈ విధంగా తాము ఏమీ చేయలేమని చెప్పడం సరి కాదని చెబుతున్నారు.

## లాసెట్‌లో సిక్కోలు హవా

- 6వ ర్యాంకుతో మెరిసిన విజయమణికంఠ
- జిల్లా నుంచి 558 మంది అర్హత


ఎం.విజయ మణికంఠ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ లాసెట్-2025 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరిశారు. జిల్లా నుంచి యూజీ, పీజీ మూడు విభాగాల్లో న్యాయ కోర్సులకు కలిపి మొత్తం 594 మంది పరీక్షలకు హాజరుకాగా గురువారం విడుదలైన ఫలితాల్లో 558 మంది ఉత్తీర్ణత సాధించి ప్రవేశాలకు అర్హత సాధించారు. మూడేళ్ల యూజీ న్యాయవిద్యకు జిల్లా నుంచి 551 మంది దరఖాస్తు చేసుకోగా 406 మంది పరీక్ష రాశారు. వీరిలో 394 మంది అర్హత సాధించారు. ఐదేళ్ల యూజీ న్యాయవిద్యకు 146 మంది దరఖాస్తు చేసుకోగా 117 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 111 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండేళ్ల పీజీ లాసెట్‌కు జిల్లా నుంచి 71 మంది దరఖాస్తు చేసుకోగా.. 53 మంది పరీక్ష రాశారు. వీరంతా అర్హత సాధించినట్టు లాసెట్ కన్వీనర్ పేర్కొన్నారు. పీజీ రెండేళ్ల ఎల్‌ఎల్‌బీ ప్రవేశ పరీక్షలో నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటున్న ఎం.విజయమణికంఠ 107 మార్కులతో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించాడు. ప్రస్తుతం విశాఖపట్నం ఏయూ క్యాంపస్‌లో మూడేళ్ల యూజీ న్యాయ కోర్సులో చివరిదైన 6వ సెమిస్టర్ పరీక్షలు రాశాడు. మంచి యూనివర్సిటీలో పీజీ లా పూర్తిచేసి, న్యాయాధికారి పోటీపరీక్షలపై దృష్టిసారించినట్టు చెబుతున్నాడు.

**కేతనకు 29వ ర్యాంకు**


తమ్మినైన కేతన

పొందూరు: పొందూరు రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన తమ్మినైన కేతన ఏపీ పీజీ లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో 29వ ర్యాంకును సాధించింది. 120 మార్కులకు గాను 100 మార్కులతో సత్తాచాటింది. ఈమె సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో బీఏ ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసింది. తండ్రి తమ్మినైన గోపాలరావు ఉపాధ్యాయునిగా పనిచేస్తుండగా, తల్లి కమలకుమారి, గృహిణి.

### యోగా దినోత్సవం విజయవంతం చేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న జరిగే యోగాలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్' అనే థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. అదే విధంగా, అలాగే రానున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కులగణన హర్షనీయం


కొమ్ము రమణమూర్తి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం పాతబస్టాండ్: దేశవ్యాప్తంగా జనగణనతో పాటే సమగ్ర కుల గణన జరిపించేందుకు షెడ్యూల్ ప్రకటించి ఈ నెల 16న గెజిట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రచురించడంపై ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 16 ఏళ్ల తర్వాత ప్రజలందరి ఆర్థిక- సామాజిక వివరాలతో సమగ్రంగా జనగణన జరపాలనుకోవడం అభినందనీయమన్నారు. తొలిసారిగా జనగణనలో పౌరులే స్వయంగా ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకునే అవకాశం కూడా కేంద్రం కల్పించిందని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఓబీసీల జనాభా కచ్చితంగా తెలిసేలా వెనుకబడిన తరగతులకు చెందిన జాతీయ స్థాయిలోని 3,746 కులాలు, రాష్ట్రస్థాయిలోని 139 కులాలకు చెందిన కుటుంబాల వారందరూ, తమ జనాభా లెక్కలతో పాటు కుల వివరాలు కూడా స్పష్టంగా తెలియజేయాలన్నారు.

## ఇంటిని తీసుకుంటే బతికేదెలా?

సారవకోట:

కుమార్తెలు ఆదరించడం లేదంటూ సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు శిమ్మ చిన్నమ్మి వాపోయింది. తనకు ముగ్గురు కుమార్తెలున్నా ఎవరూ ఆదరించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త నుంచి సంక్రమించిన ఇంటిని సైతం చిన్న కుమార్తె ఆధీనంలో తీసుకుని ఇంటి నుంచి పంపించేందుకు చూస్తోందని ఆరోపించింది. దీనిపై తహశీల్దార్, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. చిన్న కుమార్తె తన ఇంటిని తనఖా పెట్టి రూ.3 లక్షలు అప్పు తీసుకుని చెల్లించనందున, అప్పు ఇచ్చిన వారు ఆ ఇంటిని తీసుకోడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపింది. ఆ ఇంటిని తీసుకుంటే తనకు నిలువు నీడ కూడా ఉండదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది.


అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు కాపీలు చూపిస్తున్న శిమ్మ చిన్నమ్మి

## ఇల్లూ లేదు.. బిల్లూ లేదు!

- పేదలకు ఇళ్లు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- సొంత స్థలంలో నిర్మాణం చేపట్టిన వారికి బిల్లులు చెల్లించని వైనం
- లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు
- జగనన్న కాలనీలో కానరాని వసతులు


వసతులకు నోచుకోని రాగోలు జగనన్న కాలనీ అర్బన్ లేఅవుట్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కూటమి ప్రభుత్వం పేదలకు రిక్తహస్తం చూపిస్తోంది. ఎన్నికల హామీలు నెరవేర్చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. ఏ ప్రభుత్వమైనా పేదలకు ప్రధానంగా కూడు, గూడు, గుడ్డ అందించాలని భావిస్తుంటుంది. కూటమి సర్కారు మాత్రం అందుకు భిన్నంగా పేదల ఆశలపై నీళ్లు చల్లుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ జిల్లాలో ఒక్క పేద కుటుంబానికి కొత్తగా ఇల్లు మంజూరు చేయలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎక్కడా ఎవరికీ సెంటు భూమి ఇవ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇల్లు నిర్మాణాలు, బిల్లుల విషయం సైతం పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

**నెరవేరని హామీ..**

ప్రతి పేద కుటుంబానికి రెండు సెంట్లకు తక్కువ లేకుండా ఇళ్ల స్థలం, కనీసం రూ.4 లక్షల నిధులు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆ మాట మర్చిపోయారు. ఈ విషయమై ఎవరైనా ప్రశ్నిస్తే.. ఇంకా సమయం ఉందని, అన్నీ అమలు చేస్తామని అడ్డగోలు ఉపన్యాసాలు ఇస్తున్నారు తప్ప ప్రజలకు మేలు చేయడం లేదు.

**వైఎస్సార్‌సీపీ హయాంలో..**

గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్ రెడ్డి వలంటీర్ల ద్వారా ఇంటింటా సర్వేలు నిర్వహించి, అర్హత గల ప్రతి ఒక్క కుటుంబానికి ఇల్లు మంజూరు చేశారు. స్థలం ఉన్నవారికి ఇల్లు నిర్మాణం చేసేందుకు, స్వంత స్థలం లేని పేదలకు ప్రభుత్వం రైతుల నుంచి భూమి కొనుగోలు చేసి వారికి పట్టాలను అందజేసి ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారు. జిల్లాలో 30 మండలాలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో మొత్తం 80,691 ఇళ్లు మంజూరు చేశారు. ఇందుకు గాను 784 లేఅవుట్లను ఏర్పాటు చేశారు. ఇల్లు కట్టుకున్నందుకు స్థలం లేని పేదలకు ఆ లేఅవుట్స్‌లో ఇళ్ల పట్టాలు ఇచ్చి, నిర్మాణానికి నిధులు కూడా విడుదల చేసింది. ఇలా నిరుపేదలకు గూడుని ఇచ్చి వారికి సమాజంలో హోదా ఉండేలా చేసింది. జిల్లాలో 33,123 ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. మిగిలిన వారికి నిర్మాణం చేసుకొనేందుకు మూడు ఆప్షన్లు ఇచ్చి స్వయంగా కట్టుకునేవారికి కావాల్సిన మెటీరియల్, నగదు సైతం అందజేశారు. కట్టుకోలేని పేదలకు నేరుగా ప్రభుత్వమే ఏజెన్సీలను ఏర్పాటు చేసి వారి ద్వారా నిర్మాణాలు చేయించి గృహ ప్రవేశాలు సైతం పూర్తి చేసింది. ఇక స్థలం ఉండి కట్టుకునే వారికి జిల్లాలో 43,568 ఇళ్లు మంజూరు చేసింది. వారికి ఆర్థిక సాయం అందించి ఆదుకుంది. ఇలా గత ప్రభుత్వంలో 36,780 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, నిర్మాణదారులకు రూ.863.19 కోట్లు అందజేసింది.

**కూటమి పాలనలో..**

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయింది. జిల్లాలో ఒక్క నిరుపేద కుటుంబాలనికి మచ్చుకైనా ఒక్క ఇల్లు మంజూరు కాలేదు. ఇక లే అవుట్ల సంగతి సరేసరి. ఎక్కడా పేదల ఇళ్ల కోసం సెంటు భూమి కూడా కొనుగోలు చేయలేదు. అంతా కక్షసాధింపులు, నాయకుల ఆర్భాటాలు తప్ప సంక్షేమం ఊసేలేదు. స్థలం ఉండి ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

### వసతులేవీ?

గత ప్రభుత్వం చివరిలో నిర్మాణాలు చేసిన వారికి కూడా ఈ ప్రభుత్వం బిల్లులు అందజేయలేదు. దీంతో లబ్ధిదారులు కళ్లుకాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జిల్లాలో ఏర్పాటు చేసి అన్ని లేఅవుట్ కాలనీకు విద్యుదీకరణ చేశారు. అవసరం మేరకు కొత్తగా సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి నిరంతరం విద్యుత్ అందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి కాలనీలో బోరు బావులు వేయించారు. మోటారుని ఏర్పాటు చేసి తాగునీటి సమస్య లేకుండా చేశారు. అయితే ఎన్నికలు దగ్గర పడటంతో రోడ్లు, కాలువల నిర్మాణానికి బ్రేక్ పడింది. కొత్త ప్రభుత్వం పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆయా కాలనీవాసులు జిల్లా అధికారులకు, కూటమి నాయకులను వేడుకుంటున్నా ప్రయోజనం ఉండటం లేదు.


గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

## గిరిశిఖర గ్రామానికి వెళ్లి.. కష్టాలు తెలుసుకుని..

- ఉత్తరాంధ్రలోనే ఎత్తయిన కొండపైకి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గిరిశిఖర గ్రామం చందనగిరిలో పర్యటన
- గిరిజన మహిళలతో మాటామంతీ


వైఎస్సార్ సీపీ పాలనలో చందనగిరికి వేసిన రోడ్డును చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: సుమారు 1300 అడుగుల ఎత్తులో, ఉత్తరాంధ్రలోనే ఎత్తయిన గిరిశిఖర గ్రామం గొట్టిపల్లి పంచాయతీ చందనగిరి గ్రామంలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రివిలేజ్ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి పర్యటించారు. గిరిజనులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు ఏడు కోట్ల రూపాయల నిధులతో గిరిజన గ్రామాలకు రహదారులు వేశామని గుర్తు చేశారు. చందనగిరి గ్రామానికి రహదారి, తాగునీటి సదుపాయం కల్పించడమే కాకుండా.. ఎన్నడూ లేనివిధంగా ప్రత్యేక నిధులతో ట్రాక్టర్ ద్వారా కొండపైకే రేషన్ సరుకులు అందించామని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గిరిజన వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని మండిపడ్డారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. చందనగిరి గ్రామం నుంచి రేషన్ సరుకులు తీసుకోవడానికి కాలినడకన కొండదిగి నేలబొంతు గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అమలుకాని హామీలు ఇచ్చి ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. నేడు గిరిజన గ్రామాలకు వెళ్తే ఎక్కడచూసినా జగనన్న ఇచ్చిన తాగునీరు, రహదారులు, భవనాలు కనిపిస్తున్నాయి.. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఏం చేసిందని ప్రశ్నించారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని భరోసా ఇచ్చారు. అంతకుముందు గ్రామానికి వస్తుండగా.. మార్గమధ్యలో గౌరమ్మ అనే వృద్ధురాలు బియ్యం మూట పట్టుకుని కొండ ఎక్కుతున్న సమయంలో రెడ్డిశాంతి ఆమెను ఆటో ఎక్కించి పంపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడు, సర్పంచ్ డొలిబేరు జమ్మయ్య, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోలాకి జయమునిరావు, కో ఆప్షన్ సభ్యుడు భాస్కరదాస్, నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, కరణం శశిభూషణరావు, అలికాన మాధవరావు, సవర సుభాస్, గొల్ల జనార్దన, జన్ని నాగేశ్వరరావు, పెద్దబొంతు అప్పారావు, ఢిల్లీ, సలాన చిట్టి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలపై స్పందించాలి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి: జిల్లాలో వివిధ శాఖాధికారులంతా సమస్యలపై తక్షణమే స్పందన చూపాలని, అలాగే 'స్థానిక' సంస్థల ప్రజాప్రతినిధుల సూచనలను ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని వెంటనే స్పందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాల్లో 1, 2, 4, 7వ స్థాయి సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల ప్రగతి నివేదికలపై సమీక్షించారు. విద్యుత్ శాఖలో ప్రభుత్వ పథకాల లబ్ధికి సంబంధించి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, సంబంధం లేని వ్యక్తుల ఫోన్ నంబర్లకు మీటర్లు కనెక్షన్లు ఉన్నట్లుగా చూపిస్తున్నారని గుర్తు చేశారు. అలాగే ప్రభుత్వ పథకాల లబ్ధికి దారుణమైన నిబంధనలు పెట్టారని, దీంతో పేద సామాన్య వర్గాలకు అవస్థలు తప్పడం లేదన్నారు. అధికారులు వీరి విషయంలో శ్రద్ధ వహించి అర్హులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే మంచినీటి పైపుల లీకులపై చాలావరకు ఫిర్యాదులు వస్తున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించాలన్నారు. ఇదిలావుంటే జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలకు పలు ప్రభుత్వ శాఖల నుంచి సకాలంలో ప్రగతి నివేదికలు రావడం లేదని, అలాగే పలు శాఖాధికారులు హాజరుకావడం లేదని, వీరిపై చర్యలు చేపట్టేలా జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజాకు ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, విద్యుత్ శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ పి.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 3, 5, 6వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ వైస్ చైర్మన్లు పాలిన శ్రావణి, సిరిపురపు జగన్మోహనరావు, వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లిల అధ్యక్షతన జరిగాయి. కార్యక్రమంలో సంబంధిత కమిటి సభ్యులుగా జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

### కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తికి జైలుశిక్ష

పొందూరు: కింతలి గ్రామానికి చెందిన సింగూరు ప్రకాశరావుపై కత్తితో దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన పైడి వెంకట సత్యరమేష్‌కు ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ పొందూరు కోర్టు జడ్జి బి.జ్యోత్స్న గురువారం తీర్పునిచ్చినట్లు ఏఎస్ఐ రామచంద్రరావు తెలిపారు. 2020 ఆగస్టు 28న ప్రకాష్‌రావుపై కత్తితో దాడి చేయడంతో పాటు తువ్వాలుతో బిగించి ఊపిరాడకుండా చేయడంతో స్పృహ కోల్పోయాడు. ఈ ఘటనపై ప్రకాశరావు తమ్ముడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో వెంకటసత్యరమేష్‌కు కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ రొక్కం శాంతి సంతోషి వాదనలు వినిపించారు.

### ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ


గౌరికి బంగారు వస్తువులు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు, కండక్టర్, డ్రైవర్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం రెండో డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులో పి.గౌరి అనే ప్రయాణికురాలు గురువారం సాయంత్రం విజయనగరం నుంచి పూసపాటిరేగకు ప్రయాణం చేసింది. ఈ సమయంలో తన బ్యాగ్‌లో ఉన్న 6 తులాల బంగారం బాక్స్‌ను బస్సులో జారవిడుచుకుంది. విషయం గమనించక పూసపాటిరేగలో దిగిపోయింది. ఇంటికెళ్లి చూసేసరికి బాక్స్ లేకపోవడంతో ఆందోళనకు గురైంది. బస్సులో పడిపోయి ఉంటుందని భావించి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంది. జరిగిన విషయాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎస్ఎం ఎం.పి.రావు దృష్టికి తీసుకువెళ్లింది. ఇంతలో కండక్టర్ వి.వి.ఆర్.మూర్తి, డ్రైవర్ రాంబాబులకు బాక్సు దొరకడంతో తీసుకొచ్చి అధికారులకు అందజేశారు. బాక్సులో బంగారు వస్తువులు గౌరివేనని గుర్తించి ఆధార్‌కార్డు ఆధారంగా అందజేశారు. కండక్టర్ వి.వి.ఆర్ మూర్తి, డ్రైవర్ రాంబాబుల నిజాయితీని అధికారులు అభినందించారు.

### యోగాంధ్రకు ట్రాఫిక్ ఆంక్షలు

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నంలో ఈ నెల 21 జరిగే యోగాంధ్రకు భారీ ఎత్తున జనం హాజరయ్యే అవకాశం ఉన్నందున శ్రీకాకుళం జిల్లా నుంచి వెళ్లే వాహన రాకపోకలకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. శ్రీకాకుళం నుంచి వెళ్లే బస్సులు శ్రీకాకుళం, రణస్థలం, తగరపువలస, చిలకపేట మీదుగా భీమిలి బీచ్ రోడ్డు వద్దకు చేరుకోవాలి. వారికి నిర్దేశించిన పార్కింగ్ / డ్రాపింగ్ పాయింట్లలో మాత్రమే బస్సులు దిగి కేటాయించిన కంపార్ట్‌మెంట్లకు చేరుకోవాలి.